ఎస్ఎన్‌డీపీ పనులతో సత్ఫలితాలు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ఎస్ఎన్‌డీపీ పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ధర్మపురి కాలనీ చుట్టుపక్కల పరిసరాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటిస్తూ మాట్లాడారు. గతంలో చిన్నపాటి వర్షానికి ఇక్కడి ఇళ్లలోకి, రోడ్డు పైకి వరద వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని వరద నీరు రాకుండా అధికారులతో పలు దఫాలుగా చర్చించి ఎస్ఎన్‌డీపీ డ్రైయిన్ నిర్మించడం జరిగిందన్నారు. నియోజకవర్గ పరిధిలో మరిన్ని పనులు చేపట్టి వరద ముంపును శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట తిలక్‌రావు, సుజిత్, చిత్రంసాయి, దిలీప్ ఉన్నారు.

సదర్ వేడుకలకు కేంద్రమంత్రికి ఆహ్వానం

సైదాబాద్: సైదాబాద్‌లో నిర్వహించే సదర్ వేడుకలకు రావాలని అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్‌యాదవ్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. నవంబర్ 1న సైదాబాద్‌లో సదర్ ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా సాగుతాయని కిషన్‌రెడ్డికి వివరించారు.

ఉప్పరిగూడ యాదవ సంఘం ఆధ్వర్యంలో..

చంచల్‌గూడ: వచ్చే నెల 1న ఉప్పరిగూడ యాదవ సంఘం చంచల్‌గూడలో నిర్వహించనున్న సదర్ మేళాకు హాజరు కావాలని సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌ను కలిసి సంఘం నాయకులు ఆహ్వానించారు. సదర్ వేడుకలకు హాజరవుతామని హామీ ఇచ్చినట్లు సంఘం ప్రతినిధి నిరంజన్‌యాదవ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆహ్వాన కమిటీ సభ్యులు మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, అనిల్ యాదవ్, ధన్‌రాజ్‌యాదవ్ ఉన్నారు.



కిషన్‌రెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న మహేందర్‌యాదవ్

ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చంపాపేట: రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా సంస్థల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు చంపాపేటకు చెందిన అజయ్ కార్తీక్ కోరాడు. సోమవారం ఆయన సంఘం ఆధ్వర్యంలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అరకొర వేతనాలతో కుటుంబ పోషణ భారాన్ని నెట్టుకొస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను త్వరలో సీఎం రేవంతరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కోదండరామ్ హామీ ఇచ్చినట్లు అజయ్ కార్తీక్ స్పష్టం చేశారు. అనంతరం కోదండరామ్ ఉత్తమ ఉపాధ్యయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పల్లె వినయ్ కుమార్, అబ్దుల్ సమీద్, అనూషా, పాషా, సురేందర్ పాల్గొన్నారు.



ప్రైవేట్ ఉపాధ్యాయిలను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కోదండరామ్

ఎగ్జిబిషన్‌కు స్పందన



ఎగ్జిబిషన్‌లో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా కమ్యూనిటీహాల్లో స్వదేశీ హస్త శిల్పకళ సేల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌కు స్పందన వస్తోంది. అన్ని వయస్సుల వారి అభిరుచులకు అనుగుణంగా ఆధునిక ఫ్యాషన్ డిజైన్లతో మహిళలను కట్టిపడేస్తోంది. జమ్మూ కశ్మీర్ ఎంబ్రాయిడరీ చీరలు, ధర్మవరం, వెంకటగిరి, గద్వాల, పోచంపల్లి పట్టు చీరలు సరసమైన ధరలకు అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. డ్రెస్ మెటీరియల్స్, ఖాదీ వస్త్రాలు, బెడ్ కవర్లు, కుర్తీస్, జ్యూవెలరీ, హ్యాండీ క్రాఫ్ట్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.

భారీగా ఉల్లి దిగుమతి

చాదర్‌ఘాట్: దీపావళి పండుగ (గురు, శుక్ర) మార్కెట్‌కు సెలవుల నేపథ్యంలో మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వివిధ జిల్లాల నుంచి భారీగా ఉల్లి దిగుమతి అయిందని ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. 170 లారీలు వివిధ జిల్లాల నుంచి దిగుమతి కాగా అందులో మహారాష్ట్ర నుంచి 30 లారీలు, కర్ణాటక నుంచి 68, కర్నూలు నుంచి 68, మహబూబ్‌నగర్ నుంచి 13 లారీల దిగుమతి అయ్యిందని తెలిపారు.



మలక్‌పేట గంజిలో ఉల్లి నిల్వలు

'డబుల్' ఇళ్ల కేటాయింపునకు కృషిచేస్తా



బస్తీవాసులతో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

మన్సూరాబాద్: ఎరుకల నాంచారమ్మ బస్తీవాసులకు 'డబుల్' ఇళ్ల కేటాయింపునకు కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధి ఎరుకల నాంచారమ్మ బస్తీవాసులు సోమవారం మధుయాష్కీని కలిసి ఇళ్లు కేటాయించాలని కోరారు. 15 ఏళ్లకు పైగా బస్తీలో నివాసముంటున్నామని, అన్ని రకాల సర్టిఫికెట్లు ఉన్నాయని, ఖాళీగా ఉన్న డబుల్ ఇళ్లు తమకు కేటాయించాలని కోరారు. స్పందించిన మధుయాష్కి, సరూర్‌నగర్ మండల తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించి ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూమ్‌లను బస్తీవాసులకు కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

జీఓ118 సమస్యను పరిష్కరించాలని వినతి..

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో ఆయా కాలనీవాసులు ఎదుర్కొంటున్న జీఓ 118 సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మధుయాష్కీగౌడ్ అన్నారు. డివిజన్‌లోని జీఓ 118 బాధిత కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు సోమవారం మధుయాష్కీగౌడ్‌ను కలిశారు. నిషేధ జాబితాలో ఉన్న 22ఏను తొలగించకుండా తప్పులతడకతో జీఓ 118 తీసుకువచ్చారని, కన్వీనియన్స్ డీడ్‌తో తమకు ఇళ్ల నిర్మాణానికి, రుణాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా స్థానికులు మధుయాష్కీగౌడ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, శివప్రసాద్, మహేందర్‌రెడ్డి, అంజయ్యగౌడ్, కృష్ణారెడ్డి, ముత్యం రావు, శ్రీధర్‌రెడ్డి, ధనరాజ్, గణేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



మన్సూరాబాద్: పద్మశాలి సంక్షేమ సంఘం, మన్సూరాబాద్ సభ్యులు ఆదివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గంజి వెంకటేశం, అధ్యక్షుడిగా గంజి సత్తయ్య, ముఖ్య ఉపాధ్యక్షుడిగా రుద్ర లక్ష్మి నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా గజం సత్యనారాయణ, కోశాధికారిగా గుర్రం రమేష్, ఉపాధ్యక్షులుగా సీతా వెంకటేశం, అప్పం సుదర్శన్, చిక్కా భారతమ్మ, కార్యదర్శిగా మారం నర్సింహ, గంజి సాంబమూర్తి, వనం సంతోష్, సంయుక్త కార్యదర్శులుగా గుర్రం శ్రీనివాస్, కొంపెల్లి సుదర్శన్, కార్యనిర్వహక కార్యదర్శులుగా ఎలే సత్యనారాయణ, వనం జగదీశ్వర్, కార్యవర్గసభ్యులుగా రాపోలు వెంకటేశ్వర్లు, పున్న పల్లవి, వంగరి సుధాకర్, తిరందాసు యాదగిరేందర్, ముఖ్య సలహాదారుడిగా జెల్ల కోటిలింగం, గౌరవ సలహాదారులుగా గంజి సుధాకర్, దొంత యాదగిరి, గంజి శ్యాంసుందర్, వనం నర్సింహ, పొట్లబత్తిని జ్ఞానేశ్వర్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. పద్మశాలి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.



మెట్రో స్టేషన్ వద్ద సలీంనగర్‌లో సబ్‌రోడ్‌పై వెలిసిన డబ్బాలు



సలీంనగర్ రిలయన్స్ సమీపంలో..

ఆక్రమణల పర్వం.. అధికారుల మౌనం!

- కుంచించుకుపోతున్న రోడ్లు
- రాకపోకలకు ఇబ్బందులు
- చర్యలు చేపట్టాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు

మలక్‌పేట: ప్రభుత్వ స్థలాలు, రహదారులపై అధికారుల పర్యవేక్షణ లేక ఆక్రమణలకు గురవుతున్నాయి. సర్కిల్-6, పరిధి సలీంనగర్, మూసారంబాగ్, అక్బర్‌బాగ్‌లో సబ్‌రోడ్లపై కొందరు డబ్బాలు, ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అయితే.. కొందరు స్థానిక నాయకులు సబ్‌రోడ్లు, ఫుట్‌పాత్‌లపై డబ్బాలు, పందిళ్లు ఏర్పాటు చేసి అద్దెలకిస్తూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ప్రతినిధుల పేరు చెప్పి మలక్‌పేట గంజ్ నుంచి మూసారంబాగ్ చౌరస్తా వరకు ఇలా డబ్బాలు, కట్టేలు పాతి వాటి చుట్టూ ప్లాస్టిక్ కవర్లతో షెడ్లు ఏర్పాటు చేశారు. ఒకవైపు వాహనాల పార్కింగ్, మరోవైపు రోడ్డు ఆక్రమణలతో బాటసారులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణలపై దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. ఆక్రమణలపై సలీంనగర్‌కు చెందిన బి. విఠల్‌రెడ్డి, సర్కిల్ అధికారులతో పాటు జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని అసహనం వ్యక్తం చేశారు.

వనస్థలిపురంలో..

వనస్థలిపురం: వనస్థలిపురంలో యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ప్రజలకు నడకదారి లేకుండా ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలను నిర్వర్తిస్తుండగా అక్కడికి వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ దారుల్లో రోడ్లు కుంచించుకుపోయి నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతుంది. వనస్థలిపురం కాంప్లెక్స్, ఎస్‌బీఐ బ్యాంక్, హుడా ఆడిటోరియం, మహంకాళీ దేవాలయం, గణేష్ టెంపుల్, రెడ్ వాటర్ ట్యాంక్, ఎన్జీవోస్‌కాలనీ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వందలాది మంది తమ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. బాటసారులు నడిచేందుకు దారి లేకపోవడంతో నడి రోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడూ దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా వ్యాపారులు పలు చోట్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేలా రోడ్లపైనే షెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మరింత ట్రాఫిక్ సమస్యలు తలెత్తనున్నాయి. మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఆక్రమణలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.



వనస్థలిపురం మహంకాళి దేవాలయం పక్కన రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన వ్యాపారాలు

మహాధర్నాను విజయవంతం చేయాలి

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 5న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్. అశోక్ కోరారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని, మోటర్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ఆటో జాక్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 నుంచి ఇందిరాపార్కు వద్ద మహాధర్నా కొనసాగుతుందని ఆటో డ్రైవర్లందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

చాదర్‌ఘాట్: ప్రతి సోమవారం డీసీ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులు అన్ని ఆన్‌లైన్‌లో వస్తున్నాయన్నారు.

ఆస్తిపన్ను వసూలు టార్గెట్ రూ. 2 కోట్లు

చాదర్‌ఘాట్: ఈ నెల చివరి వరకు రూ. 2 కోట్లు ఆస్తిపన్ను వసూలు చేయాల్సిందేనని జీహెచ్ఎంసీ కమిషనర్ మలక్‌పేట సర్కిల్-6 అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు డీసీ జయంత్ తెలిపారు. ఇప్పటి వరకు రూ. 15 లక్షలు మాత్రమే వసూలు అయినట్లు ఆయన పేర్కొన్నారు.

జలమండలి దృష్టికి మార్కెట్ డ్రైనేజీ సమస్య

చాదర్‌ఘాట్: మలక్‌పేట హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లోని డ్రైనేజీ సమస్యను జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు మార్కెట్ గ్రేడ్-1 అధికారి చిలుక నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యతో మార్కెట్‌లోని రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికంగా ఉండే జలమండలి అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందన లేదన్నారు.

ప్రమాదకరంగా కుంగిన మ్యాన్‌హోల్

చైతన్యపురి: నాసిరకంగా వేసిన మ్యాన్‌హోల్ లోపలకు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. గడ్డిఅన్నారం డివిజన్ గౌతంనగర్ కాలనీలో కుంగిన మ్యాన్‌హోల్ మరమ్మతు చేసేందుకు మూడు రోజుల క్రితం చుట్టూ రోడ్డు తవ్వారు. తర్వాత పనులు చేయటం మర్చిపోయారు. ఇప్పుడు కుంగిన మ్యాన్‌హోల్ మరింత లోపలకు వెళ్లి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు కిందపడి ప్రమాదాల బారిన పడేలా ఉందని స్థానిక కాలనీవాసి కీర్తిగారి అనంతాచారి తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు.

నిధుల మంజూరుకు వినతి

ఎల్‌బీనగర్: సామనగర్‌కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు, కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సోమవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని పలు కాలనీల్లో వీధిదీపాలు, రోడ్లు, పార్కులను అభివృద్ధి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో యాదగిరిరెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అంజన్‌కుమార్, రమేష్ ఉన్నారు.



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

ప్రతి పౌరుడు యూనిఫామ్ లేని పోలీస్



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ కాశిరెడ్డి

ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య



సైకిల్ ర్యాలీ ప్రారంభోత్సవంలో ఏసీపీ కృష్ణయ్య

నాగోలు: ప్రతి పౌరుడు యూనిఫామ్ లేని పోలీస్ అని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల కోసం శ్రమించి విధి నిర్వహణలో అసువులు బాసారని అన్నారు. ప్రజలందరూ సహకరించినప్పుడే శాంతిభద్రతను కాపాడేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ప్రజలు కూడా పోలీసులలో భాగమే అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు వినోద్ కుమార్, సూర్య నాయక్, వెంకటేశ్వర్ రావు, సైదిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగం మరువలేనిది..

హస్తినాపురం: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగం మరువలేమని వనస్థలిపురం డివిజన్ ఏసీపీ పల్లె కాశిరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలోని వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్ఓలు నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పోలీసులు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, నాగరాజుగౌడ్, అంజిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

బీసీ గర్జనను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నేతలు

మన్సూరాబాద్: నవంబర్ 3న మిర్యాలగూడలో నిర్వహించనున్న బీసీ గర్జనను విజయవంతం చేయాలని బీసీ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీసీ గర్జన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నేతలు మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీలకు రాజకీయ రంగంలో తీరని అన్యాయం జరుగుతుందని, బీసీ జనాభా ప్రకారం అన్ని రంగాల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి కేవీగౌడ్, బీసీ సంఘాల నేతలు బొమ్మ రఘురాంనేత, దుర్గయ్యగౌడ్, అవ్వారు వేణుకుమార్, కోట్ల వాసుదేవ్, కొండల్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, బాలకృష్ణ, యాదగిరి వంశరాజ్, వాసు, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

31న సాయి ఆలయంలో ప్రత్యేక దీపాలంకరణ

చైతన్యపురి: దీపావళి సందర్భంగా దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి బాబా ఆలయంలో ప్రత్యేక దీపాలంకరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ చైర్మన్ బీవీ శ్యాంకుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు నూనె దీపాలు, ప్రత్యేక పూల అలంకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. దీపావళికి విరాళంగా భక్తులు నూనె, వత్తులు, ఆవునెయ్యి, ప్రమిదలు ఇవ్వవచ్చన్నారు.

పాఠశాల స్థలాన్ని పరిరక్షించాలి



విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న సభ్యులు

నాగోలు: బండ్లగూడ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని పరిరక్షించి, పాఠశాల ప్రహరీ కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బండ్లగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, పాఠశాల పరిరక్షణ సభ్యులు సోమవారం బండ్లగూడ చౌరస్తాలో కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బండ్లగూడ గ్రామంలో నిరుపేద విద్యార్థుల కోసం 1998లో ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్ 36/6లో ఎకరం స్థలం పాఠశాల కోసం కేటాయించారన్నారు. కొంత మంది నకిలీ పత్రాలు సృష్టించి స్థలం కాజేయాలని చూస్తున్నారని ఉన్నతాధికారులు పాఠశాల స్థలం కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మేడ్చల్ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

బోరు బావి మోటార్‌కు మరమ్మతు చేపట్టాలి

చంపాపేట: చంపాపేట డివిజన్ హరిజన బస్తీ నవజీవన జ్యోతి సంఘం భవనం ఆవరణలోని బోరు బావి మోటార్‌కు మరమ్మతు చేపట్టి కాలనీవాసుల నీటి సమస్యను తీర్చాలని సంఘం కార్యవర్గ సభ్యుడు పాశం శ్రీశైలం అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నవజీవన జ్యోతి సంఘ పరిసర వాసుల నీటి కొరతను తీర్చే బారుబావి మోటారు గత కొన్ని రోజులుగా పనిచేయకపోవంతో నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని హరిజన బస్తీ కార్యవర్గ సభ్యులు కట్టా వెంకటేష్, జగన్, ప్రకాష్ కోరుతున్నారు.

జాతీయ పోటీలకు ప్రభుత్వ కాలేజీ విద్యార్థి



ప్రతిభ చాటిన ఎన్.ధోనీ

మన్సూరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించి క్రాస్ కంట్రీ రేస్ (10కి.మీ) పోటీల్లో హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డీగ్రీ కళాశాల బీ.ఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎన్.ధోని మూడవ స్థానంలో నిలిచి మహారాష్ట్రలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. యూనివర్సిటీ స్థాయిలో జరిగిన పోటీల్లో అరవింద్ (బీకాం), హరిప్రసాద్ (బీఎస్సీ), బి. అరవింద్ (బీఎస్సీ), హెచ్. గోపాల్(బీకామ్) ప్రభుత్వ డీగ్రీ కళాశాల హయత్‌నగర్ జట్టు మూడవ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ జ్యోత్స్న ప్రభ తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపాల్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ డా. కె.అనిత, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి



ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు, బస్తీ వాసులు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ మండల పరిధి ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని ప్రభుత్వం స్థలం, చెరువు కుంటను కొంత మంది ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని సంబంధిత అధికారులు సదరు స్థలాన్ని కాపాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) సరూర్‌నగర్ మండల సమితి కార్యదర్శి బాతరాజు నరసింహ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి ఎన్టీఆర్‌నగర్‌లో ఉన్న కుంటను రక్షించాలని కోరారు. కొంతమంది తప్పుడు పేర్లను సృష్టించి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. సదరు స్థలాన్ని పరిరక్షించి స్థానికులు ఉపయోగపడేలా పాఠశాల, పార్కును ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు స్థానికులతో కలిసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాములు గౌడ్, బస్తీవాసులు ఫజల్, రవి, నరేష్, రవి, శ్రీకాంత్, వాసు, నరేష్, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములు కావాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మందమల్లమ్మ జంక్షన్ అభివృద్ధి కోసం రూ.1.10 కోట్లతో చేపడుతున్న పనులను సోమవారం కార్పొరేటర్ పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే సహించేదిలేదని డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్పొరేటర్ వెంట గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సుంకరి రమేశ్‌గౌడ్ ఉన్నారు.

స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారు



సభ్యత్వం చేయిస్తున్న విజయలక్ష్మి

మలక్‌పేట: అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి అన్నారు. బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా కార్యదర్శి భార్గవచారి ఆధ్వర్యంలో అక్బర్‌బాగ్ డివిజన్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్‌యాదవ్, రమేష్‌గుప్తా, మడిగల లక్ష్మారెడ్డి, తులసి పాల్గొన్నారు.